ఓ చక్రవర్తి పరిపాలిస్తున్న సామ్రాజ్యంలో ఓ ఊరు చివర చెరువు గట్టు చింతచెట్టు నీడలో చీకట్లో ఇద్దరు సామాన్యులు కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

"మిత్రమా! ఈ సంగతి విన్నావా?"

"ఏమిటది?"

"మన రాజుగారు నూరో భార్యని పెళ్ళి చేసుకొని శత వివాహోత్సవం జరుపుకుంటారట. ఆమె గురించి బంగారపు ద్వారాలతో పాలరాతి భవనమూ, అందులో వెండితో స్నానశాలలూ, కంచుతో పానశాలలూ, రాగితో భజనశాలలూ, గాజుతో శయ్యా మందిరాలూ, నవరత్నాలతో నాట్యమండపాలూ నిర్మిస్తున్నారట. ఆహా! ఏం వైభోగం? జన్మంటే క్షత్రియులదే జన్మ!"

"మరి నీ దేలాంటి జన్మ?"

"నాదా? కష్టజన్మ, మిత్రమా?"

"నువ్వెందుకు రాజువి కాకూడదు?"

"అదేమిటి, మిత్రమా? నే నేమిటి? రాజుని కావడమేమిటి?! అది సాధ్యమా?"

"సాధ్యమైతే రాజుని కావాలనే ఉంది నీకు. సరే. మన రాజుగారుకూడా మనిషే గదా?"

"అయితే?"

"మన లాగే నేలమీద పుట్టి నేల మీదే మరణిస్తాడు కదా?"

"అవును."

"మరి నువ్వెందుకు ఎండలో వానలో, మట్టిలో పడి కొట్టుకుంటున్నావు? అత డెందుకు భోగాల్లో తులతూగుతున్నాడు?"

"విధి!"

"కాదు. నీ బానిస మనస్తత్వానికి అలా చెప్పి ఓదార్చుకుంటున్నావు. మనం ప్రజలం. ఎముకలు విరిగిపోయేలాగ శ్రమించి, పంటలు పండిస్తాం. భార్యాబిడ్డల్ని గాలికి వదిలి దేశాలన్నీ తిరుగుతూ వ్యాపారం చేస్తాం. మనం సాలీలం. మనం కమ్మర్లం. మనం కుమ్మర్లం. మనం ఇళ్ళు కడదాం. మనం పల్లకీ మోస్తాం. మనం తేనెతుట్టెలో కూలి ఈగలం. మన శ్రమపైన మన రాజుగారు తాగి తందనా లాడి, శత వివాహోత్సవాలు చేసుకుంటారు."

"అందువల్ల మనకి నష్టం లేదు కదా!"

"ఉంది. అది నీ బానిస మనసుకి తట్టదు. నీకు వ్యక్తిత్వం లేదు. నీకు స్వేచ్ఛ లేదు. నీకు స్వతంత్రం లేదు. మన రాజుగారికి హిందువు లంటే ఇష్టం. కాబట్టి మహమ్మదీయుల పీకలు కోసేస్తున్నాడు. మనం హిందువులం. కనక బతికి

## టి. షణ్ముఖరావు

పోయాం. ఇతణ్ణి ఓడించి మన పక్క రాజ్యంలోని మహమ్మదీయుడు రాజైతే అతడు మన్నేం చేస్తాడు? ఒక్కొక్క రాజుకి ఒక్కొక్క వెర్రి ఉంటుంది. ఒకడు తాగేసి పడుకుంటాడు. ఒకడికి జూదమే ప్రపంచం. మరొకడు రాజ్యంలో అందరి భార్యల్నీ ఎత్తుకు పోతాడు. వేరొకడు కవులనైతేనే ఆదరిస్తాడు. ఇంకొకడు ఎప్పుడూ యుద్ధమే చేస్తానంటాడు. వాళ్ళ సొమ్మేం పోయింది? రాజూ రాజూ కలిసి తన్నుకుంటే మధ్య చచ్చేది ప్రజలే. ఆయా రాజుల అభిరుచుల్ని బట్టి ప్రజలు భావదాస్యం చేస్తుంటారు."

"ఏదో మూడు పూటలా తిండి తింటున్నాం కదా?"

"జీవితానికి తిండే పరమావధి కాదు. ఇంకా చాలా ఉన్నాయి. నువ్వు నువ్వుగా, ఒక వ్యక్తిగా ఆలోచించిననాడు నీ కది తెలుస్తుంది."

"నువ్వు చెప్పింది నిజమేలా ఉంది, మిత్రమా!"

"ఈ వ్యవస్థ మారాలి. . . మంచి రోజులు రావాలి."

* * *

ఓ పరదేశ ప్రభుత్వం వలస పాలన చేస్తున్న దేశంలో ఓ ఊరు చివర పాడుబడ్డ బంగళా వరండానీడలో చీకట్లో ఇద్దరు సామాన్యులు కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

"ఈ సంగతి విన్నావా?"

"ఏమిటది?"

"మన దేశపు రాజకీయనాయకులూ, ప్రజలూ కలిసి సమావేశమైన చోట ప్రభుత్వపు పోలీసులు అన్ని దార్లూ మూసేసి మన వాళ్ళని వందలమందిని కాల్చి చంపేశారట."

"మన వాళ్ళలో చైతన్యం కలుగుతూంది."

"ఏం చైతన్యం? ఎందుకు ప్రభుత్వంతో తంటా?"

"తంటా ఏముంది? మన దేశం మన కిచ్చేయమంటున్నాం."

"ఇప్పుడు మన కేమైందని?"

"మన నెత్తిని పరాయివాడు కూర్చుని సవారీ చేస్తున్నాడు. ఇంకేం కావాలి? సైన్య సహకార పద్ధతి ప్రవేశపెట్టి రాజుల్ని లోబరుచుకున్నారు. రాజులకి దత్తస్వీకార పద్ధతి లేకుండా చేసి రాజ్యాల్ని దోచుకున్నారు. కోర్టుల్లో న్యాయనిర్ణేతలుగా, పెద్ద అధికారులుగా వాళ్ళే ఉన్నారు. మనం కష్టపడి పండించుకున్న దానికి పన్ను కట్టాలన్నారు. వ్యాపారాన్ని మాత్రమే ప్రోత్సహించి, పరిశ్రమలు మూసివేసి, నిరుద్యోగ సమస్య పెంచారు. మన దేశస్థులు జ్ఞానవంతులై తిరగబడకుండా విద్యావిధానం సంకుచితం





చేశారు. మన దేశం నుండి అమూల్యమైన శిల్పాలూ, వజ్రాలూ, ధనమూ, సంపదా, ఆహారపదార్థాలూ తమ దేశానికి తరలించేస్తున్నారు.''

''ఏదో ఇంత తిని బ్రతికేస్తున్నాం కదా!''

''నిన్ను నువ్వు అమ్ముకొని ఆత్మవంచన చేసుకొని వాళ్ళ కాళ్ళు పడితే ఇంత గంజి పోస్తున్నారు. వాళ్ళ తిట్లన్నీ, వాళ్ళ తన్నులనీ భరిస్తే బ్రతకనిస్తున్నారు. మన ఆడవాళ్ళని వాళ్ళు చెరుస్తుంటే చూస్తూ ఊరుకున్న వాళ్ళని మంచివాళ్ళంటున్నారు. ఇంతేనా నువ్వు చెప్పేది? విలువైన ఆహారం వాళ్ళు కొట్టేసి, గడ్డి మాత్రం మనకి పెడుతున్నారు. గొప్ప పదవుల్లో వాళ్ళే ఉండి, గుమాస్తాలుగా మనల్ని క్రింద పడేశారు. రోజుల కొద్దీ చాకిరీ చేయించుకుని నాలుగు కూలి డబ్బులు మన మొహాన పడేస్తున్నారు. ఇదేమిటే అన్యాయమంటే చంపుతున్నారు. మనమూ మనుషులమని ఏలినవారు మరిచిపోయారు. ఈ పాడు బ్రతుకుంకంటే మన దేశం మనమే తీసుకొని పాలించుకుంటే మంచిది.''

''నువ్వు చెప్పింది నిజమేలా ఉంది సుమా!''

''ఈ వ్యవస్థ మారాలి. . . మంచి రోజులు రావాలి.''

ఓ ప్రజాస్వామ్యపు దేశంలో ఓ ఊరి చివర గుడిసె నీడలో చీకట్లో ఇద్దరు సామాన్యులు కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

''ఈ సంగతి విన్నావా?''

''ఏమిటి?''

''మన రాష్ట్రంలో మూడు రోజుల క్రితం ఏర్పడ్డ మంత్రివర్గం పడిపోయిందట.''

''పడిపోతేనేం? మరో పరస దుర్మార్గులు పదవిలో కొస్తారు. రాముడూ, రహీమూ, క్రీస్తూ—ఎవరైతేనేం మనిషికి కనిపించనట్టు, ఏ వ్యక్తి పదవిలోకి వచ్చినా మనకి దొరికేదేం లేదు. వీళ్ళకి కావలసింది పదవిగాని ప్రజలు కారు.''

''మరా పదవి మనం ఓట్లేస్తే వచ్చిందే గదా?''

''నిప్పు మనం తయారు చేసుకున్నదే గదా! దాన్ని వంట చెయ్యడానికి వినియోగించుకునేవా రున్నారు. ఇళ్ళు తగల బెట్టడానికీ వినియోగించే వారు ఉన్నారు.''

''నాయకులు మన కెందుకు ఉపకారం చెయ్యరు?''

''నీకు ఉపకారం చెయ్యడానికి పోటీపడి లక్షలు ఖర్చు పెట్టి, నానా అగచాట్లూ పడి, నక్క వినయాలూ చూపించి ఎన్నికల్లో నిలబడ్డం లేదు. వాళ్ళ కోట్లు కూడబెట్టి అసమానమైన అధికారంలోనూ, అద్భుతమైన సుఖాల్లోనూ తులతూగాలని ఎన్నికల్లో నిలబడి గెలుస్తున్నారు. గెలిచి ఆలక్ష్యసిద్ధి పొందుతున్నారు.''

''ఎందు కిలా జరుగుతూంది?''

''మన దేశంలో ఎవడెంత ధనాన్నైనా కలిగి ఉండచ్చు. అందుకే ఇలా జరుగుతూంది. మనకి మూడు వర్గాల ప్రజలు కనిపిస్తారు—భూస్వాములూ, వ్యాపారులూ పారిశ్రామికవేత్తలూ. వీళ్ళే నాయకులు. వీళ్ళే ప్రభుత్వం. లేదా వీళ్ళే ప్రభుత్వానికి వెన్నెముకలు. వీళ్ళే కీలకమైన ఉద్యోగులూ, అధికారులూ. ఇంకేముంది? డబ్బున్నవాడు పదవిలో కొస్తాడు. పదవిలో కొచ్చిన వాడు డబ్బు సంపాదిస్తాడు. ఇదొక విషవలయం. మధ్య నలిగేది మధ్యతరగతి ప్రజలూ, పేదలూ.''

''మనం స్వతంత్రంగా ఉన్నాంగదా? మన ఇళ్ళూ, మన ఆస్తులూ, మన కంపెనీలూ, మన మతాలూ, మన కళలూ మన వినోదాలూ మనకు ఉన్నాయి. అవన్నీ మనం స్వేచ్ఛగా అనుభవించే హక్కుకూడా మన కుంది.''

''ఉంది, నిజమే. ఓ మెట్రోపోలిటన్ సిటీలో, ఇంటర్నేషనల్ హోటల్లో, పదహారో అంతస్తులో, ఎయిర్‌కండిషన్డ్ గదిలో, టెలివిజన్‌లో బ్లూఫిల్మ్ చూస్తూ ఫోమ్—ఫోమ్ మఖమల్ సోఫా మీద ప్రియురాలి ఒడిలో స్కాచ్ చప్పరిస్తూ గడపచ్చు. కాని, ఆ హోటల్ గేటు దాటి లోపలికి అడుగు వెయ్యాలంటే నీకు కొన్ని వందలు కావాలి. ఆ వందలు నీ జేబులో పెట్టాలని ఉండే అవకాశ మివ్వదు ప్రభుత్వం. ఆ హోటల్ గేటు ముందర నిల్చొని 'దీనిలోకి వెళ్ళే హక్కు నా కుంది' అని నువ్వంటే, అక్కడ గూర్ఖా 'దానికి కొంత రేటుంది' అంటాడు. అంటే, నీ హక్కులు నువ్వు అనుభవించడానికి కొంత రేటుంది. ఆ రేటు నువ్విచ్చుకోలేవు. ఆ సుఖాలూ పొందలేవు. అది కొందరికే పరిమితం. ఆ హక్కు మాత్రం అందరికీ ఉందని కాగితాల మీదుంది.''

''ఇప్పుడు మన సమస్య లేమిటి?''

''అవినీతి, లంచాలు, మోసం, దగా, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, అధిక ధరలు, దొంగనిల్వలు, పేదతనము, ఆకలి చావులు—ఒకటేమిటి?''

''నాకు రెండు రోజులై తిండి లేదు.''

''ఎలా ఉంటుంది? భూస్వామి పండించిన తిండిగింజలు వ్యాపారి కొట్లోకి వెళతాయి. అవి నీ నోట్లోకి రావాలంటే బాగా డబ్బు కావాలి. ఆ డబ్బు నీ దగ్గ

రుండదు. అందుకే నీకు కష్టాలూ తప్పవు."

"నేను రాజకీయాల్లో పాల్గొనగలను. రాష్ట్రపతి కాగలను. అన్ని ఉద్యోగాలూ చెయ్యగలను. అన్ని కళలూ ప్రదర్శించ గలను. అన్ని మతాలూ స్వీకరించగలను."

"మూడు పూటలా తిండి మాత్రం తినలేను."

"నువ్వు చెప్పింది నిజమేలా ఉంది సుమా!"

"ఈ వ్యవస్థ మారాలి. . . మంచి రోజులు రావాలి."

* * *

ఓ సామ్యవాదపు దేశంలో ఓ మారుమూల చిన్న ఫాక్టరీ గేటు నీడలో చీకట్లో ఇద్దరు సామాన్యులు కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

"ఈ సంగతి విన్నావా?"

"ఏమిటి?"

"మన కవిని దేశాంతరం పంపేశారట."

"అలా చేస్తారనే అనుకున్నాను."

"ఏం నేరం చేశాడో?"

"ఏం నేరం చేశాడా? నిజం చెప్పాడు! ఈ దేశంలో ప్రభుత్వం పేరిట ఎలాంటి నియంతృత్వం సాగుతూందో చెప్పేశాడు. ఈ దేశంలో ప్రజలెంత నికృష్టమైన, యాంత్రికమైన బ్రతుకులు గడుపుతున్నారో చెప్పేశాడు."




ఏకరూపత

చిత్రం— పి. ఎ. పారు ( ధర్మపురి )

"మన మీద సాగుతున్న నియంతృత్వం ఏమిటి?"

"ఏమని చెప్పను? మనిషికి ఉండే ప్రాథమిక హక్కుల్లో ఏవీ మనకి లేవు. ఆ హక్కుల గురించి మనం ప్రయత్నించి అలజడి చెయ్యకుండా పోలీసులు కాపాడుతున్నారు. ముఖ్యంగా మన నమ్మకస్థులూ, జాతీయ బలహీన వర్గాల వారూ, మేధావులూ దేశంలో బ్రతకలేకపోతున్నారు. దేవుడిమీద నమ్మకం లేని ప్రభుత్వం కావాలి వీళ్ళకి. అందుకని ప్రజలందర్నీ నాస్తికుల్ని చేస్తున్నారు. ఆస్తికుల్ని కఠిన శిక్షలకు గురి చేస్తున్నారు. ఇక ఇతర దేశాలనుండి వచ్చిన జాతీయ బలహీన వర్గాలవారిని మన దేశప్రజల్లాగే తయారు చేస్తున్నారు. ప్రభుత్వం విధించిన ఆంక్షలకు తట్టుకోలేక, ఆత్మవంచన చేసుకోలేక, వారిలో కొందరు ఆత్మహత్యనే చేసుకుంటున్నారు. శాస్త్రవేత్తలూ, సాంకేతిక నిపుణులూ, కళాకారులూ, రచయితలూ రాజకీయ నియంతృత్వం భరించలేక, చల్లని మానవత్వం గురించి తపించిపోతున్నారు. దేశం నుండి పారిపోవాలనికూడా ప్రయత్నిస్తున్నారు."

"మరి ప్రజలు గడుపుతున్న నికృష్ట జీవితమేమిటి?"

"ఇంకేం కావాలి? నువ్వు నమ్మిన దేవుణ్ణి కొలుచుకోలేవు. నీ కిష్టమొచ్చిన సభ్యతనీ, ఆచారాన్నీ పాటించలేవు. నువ్వు ప్రేమించిన సంస్కృతిని అలవరుచుకోలేవు. నీ కిష్టమైన తిండి తినలేవు. నీకు ప్రియమైన కళని ప్రదర్శించలేవు. నువ్వు కోరుకున్న బట్టలు వేసుకోలేవు. నువ్వు అన్ని విధాలా బందీవి. బానిసవి. నీకు హక్కులూ లేవు, స్వేచ్ఛా లేదు. నువ్వు పనిచేసే యంత్రంలో నువ్వుకూడా ఓ చక్రానివి."

"మన దేశపు నేలమీద పుట్టిన సంపదంతా, మన పరిశ్రమల ఉత్పత్తి అంతా మనమే పంచుకొని, మనమే అనుభవిస్తున్నాం కదా!"

"వ్యక్తి స్వేచ్ఛ లేని అనుభవాలు దేనికి?"

"మరి మూడు పూటలా ఖచ్చితంగా తింటున్నాం. ఆకలి బాధ మనకి లేదు."

"పక్షులూ, జంతువులూ ఏదో ఒక ఆహారంతో పొట్ట నింపుకొని బ్రతికేస్తున్నాయి. మరి మనిషి వాటికన్నా ఉన్నతుడని చెప్పుకోవడం దేనికి? కొన్ని ప్రత్యేకమైన విలువలు ఉన్నాయనే కదా! ఆ విలువలు లేనప్పుడు తిని తిరిగి పనిచేసి ఏం ప్రయోజనం? అంతకన్నా అడవుల్లో కందమూలాలు తిని బ్రతకచ్చు."

"నువ్వు చెప్పింది నిజమేలా ఉంది సుమా!"

"ఈ వ్యవస్థ మారాలి. . . మంచి రోజులు రావాలి." ★

